అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 11 జులై 2023

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-సిరికొండ

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని వాయిపేట్ గ్రామానికి చెందిన నైతం లక్ష్మణ్(17) పిచ్చిపిచ్చిగా ప్రవర్తించేవాడు. మానసికంగా ఆరోగ్యం బాగాలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నీరేష్ తెలిపారు.

వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 3నెలల వృత్తి శిక్షణ తరగతులకు దరఖాస్తు చేసుకోవాలని ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్‌ను సింగరేణి హైస్కూల్ సేవా సమితి కేంద్రంలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కోర్సులకు సింగరేణి ఉద్యోగులు, మాజీ కార్మికుల కుటుంబ సభ్యులు, భూనిర్వాసితులు, ఏరియాలోని కెకె ఓసీపీ ప్రాజెక్టు, ఆర్కె ఓసీపీ ప్రాజెక్ట్ రామకృష్ణాపూర్, శ్రావణ్‌పల్లి ఓసీపీ, చుట్టుపక్కల గ్రామాల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు మందమర్రి జీఎం ఆఫీస్ పర్సనల్ డిపార్ట్మెంట్ సింగరేణి సేవాసమితిలో లభిస్తాయన్నారు. ఈ నెల 20వరకు గడువు ఉందన్నారు.

జీపీ కార్మికుల సమ్మె ఉధృతం


నిర్మల్

నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులకు జీఓ నెం.60 ప్రకారం రూ.15,600 వేతనం ఇవ్వాలన్నారు. ఐదు రోజుల నుంచి కార్మికులను ఎంపీడీవోలు, సర్పంచులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఈ ధోరణి సరికాదని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. 11వ పిఆర్‌సి వర్తింపజేయాలని పోరాటాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జీఓ 51 తీసుకొచ్చి కార్మికులను పని భద్రతకు దూరం చేసి, మల్టీపర్పస్ వర్కర్స్‌గా మార్చి పని భారాన్ని పెంచిందని విమర్శించారు. కార్మికులకు రూ.2లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని సీఎం కేసీఆర్ హామీనిచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. వచ్చే వేతనాలు కుటుంబ పోషణకు సరిపోక కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నారపాక నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు, ఆకాష్, సతీష్, మహేష్, పోశెట్టి, నగేష్, శివాజీ, మధు, పోశెట్టి, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శ్రమజీవులను ఇబ్బందులకు గురిచేసే చర్యలు మానుకోవాలన్నారు. ఏండ్ల తరబడి గ్రామాల్లో ఊడిగం చేయించుకుంటున్న ప్రభుత్వం వారి శ్రమకు తగిన వేతనాలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్మికులకు పనిభద్రత లేకుండా పోతోందని, అధికారులు, కాంట్రాక్టర్లు చెల్లించే అరకొర కూలీతో కాలం వెల్లదీస్తున్నారన్నారు. డిమాండ్లు తక్షణమే పరిష్కరించి సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. బీమాను రూ.2లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలని, పంచాయతీ సిబ్బందికి ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోతుకూరి దేవేందర్, కార్యదర్శి సంతోష్, అశోక్, గంగాధర్, నర్సక్క, ఊషన్న పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు సోమవారం మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులు బీఆర్ఎస్ పాలనలో వెట్టి చాకిరికి గురవుతున్నారన్నారు. పనిచేస్తున్న కార్మికుల్లో బడుగు బలహీన అట్టడుగు వర్గాలకు చెందిన వారే ఎక్కువ మంది ఉన్నారని, వీరి పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పి రమేష్, ధర్మయ్య, చైన్‌రావు, విజయ్, మహేష్, భాగ్య, పావని పాల్గొన్నారు.

జైపూర్ : న్యాయమైన డిమాండ్లతో సమ్మె చేపట్టిన గ్రామ పంచాయతీ వర్కర్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని రామారావుపేట్ గ్రామ పంచాయతీ పాలకవర్గం విజ్ఞప్తి చేస్తోంది. మండల కేంద్రంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ వర్కర్ల సమ్మెకు సోమవారం రామారావుపేట్ గ్రామ పంచాయతీ పాలకవర్గం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్కర్లు సమ్మె చేపట్టడంతో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు కుంటుపడినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్కర్ల న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం చూపించాలని కోరారు. పంచాయతీ వర్కర్ల సమ్మెకు మద్దతు తెలిపిన వారిలో ఎంపీటీసీ పెద్దల బాపు, ఉప సర్పంచ్ తంగళ్లపల్లి వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు నామాల తిరుపతి, పలువురు వార్డు సభ్యులు ఉన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. రోజు వారి నిరసన కార్యక్రమాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు దాసరి రాజయ్య, శ్యామ్, కటుక దీపక్, అట్ల మల్లేష్, వెంకటేష్, కరీం, విజయ్, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

తాంసి : భీంపూర్ మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బిజెపి నాయకులు చిలక దేవిదాస్ సైతం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పొచ్చారెడ్డి, నర్సారెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.


బజార్‌హత్నూర్



కాగజ్‌నగర్‌రూరల్

హామీలు విస్మరించిన కేసీఆర్ ప్రభుత్వం

- ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్మెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్ నాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

గత ఎన్నికల్లో ఏజెన్సీ పర్యటనకు వచ్చిన కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయారని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్మెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. మండలంలోని సాకెర(యం) గ్రామ పంచాయతీలో వినోద్ నాయక్ ఆధ్వర్యంలో దాదాపు 60 మంది మథురా కులస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీకి మద్దతుగా నిలిచే మథురా కులస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరడం చాలా ఆనందంగా ఉందని, గ్రామంలో ఎక్కడ చూసిన సమస్యలేనని తెలిపారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా పర్యటనకు వచ్చిన కేసీఆర్ 30 రోజులు తిష్ట వేసి సమస్యలు అన్ని పరిష్కారం చేస్తా అని చెప్పారని తెలిపారు. 300 రోజులు అయినా కూడా జిల్లాని పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. సీఎం బాటలోనే పయనిస్తున్న స్థానిక ఎమ్మెల్యే ఎన్నికలప్పుడే గ్రామానికి వచ్చి ఓట్లు అడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు గోపాల్ నాయక్, భావసింగ్, ఈశ్వర్, ధన్‌రాజ్, మనోజ్, సునీల్, అజయ్, సంజయ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం



నవతెలంగాణ - వాంకిడి

తరుచుగా ప్రమాదాలు జరుగుతున్న జాతీయ రహదారిపై మండల పోలీస్, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, టీబీఎల్ సోమవారం పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నామని సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్ అన్నారు. సోమవారం ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ ప్రజల రక్షణ ప్రధాన ధ్యేయంగా వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో వారి భద్రత ప్రయాణం కోసం రోడ్డుపై, డ్రైనేజీలు ఉన్న ప్రాంతాల్లో మరమ్మత్తులు నిర్వహించి ప్రత్యేక లైటింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐ, ఆర్అండ్‌బీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే చాలా ప్రమాదాలు జరగడంతో ఇలాంటి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

కనీస వసతుల కల్పనలో నిర్లక్ష్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సరస్వతినగర్, దుర్గానగర్, పిట్టలవాడ పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీ టూ పీజీ నిర్బంధ విద్యను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని, పాఠశాలలో మరుగుదొడ్లు లేవని, నైట్‌వాచ్మెన్‌లు లేక పోవడం వల్ల పాఠశాలలలో సామగ్రి చోరికి గురవుతున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తింటున్న బియ్యాన్ని మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తున్నామని చెప్తున్న నాయకులు ఒకసారి ఆదిలాబాద్‌లోని పాఠశాలలను సందర్శించాలన్నారు. పిల్లలకు పురుగుల అన్నం పెడుతున్నారని మండిపడ్డారు. ఆమె వెంట నాయకులు దారట్ల జీవన్, లీలావతి, సతీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శివకిరణ్, సందీప్ ఉన్నారు.

కస్బా పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-నిర్మల్

కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ వై.సాయన్న ఆధ్వర్యంలో 25మంది ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపికను సోమవారం చేపట్టారు. విద్యార్థుల ఎంపికలో కంటి చూపు, రన్నింగ్, పుష్ అప్స్, ఫిజికల్ ఫిట్నెస్ టెస్టులు నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు శారీరక, మానసిక శిక్షణనిస్తూ ఉత్తమ దేశపౌరుల తీర్చిదిద్దడానికి దోహదపడుతుందన్నారు. తర్వాత పదిరోజుల క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. క్యాంపులో ఉదయం రన్నింగ్, డ్రిల్లు, షూటింగ్, క్లీన్ అండ్ గ్రీన్, రక్తదాన శిబిరం, ఎయిడ్స్ అవగాహన, వరకట్న నిషేధం వంటి ప్రముఖమైన వాటిపై శిక్షణనిచ్చి ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దుతామన్నారు. ప్రతి విద్యార్థి దేశ సేవ చేయడానికి తమ వంతుగా ముందుకు రావడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, ఆర్మీ ఇన్‌స్ట్రక్టర్ హవల్దార్ ప్రమోద్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్షాకాలం వ్యాధుల నియంత్రణకు చేపట్టవలసిన చర్యలపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభం నేపథ్యంలో వ్యాపించే మలేరియా, డెంగ్యూ, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. మురుగునీటి కాలువలు, డ్రైనేజీ శుభ్రం చేయించాలని, రహదారులపై వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. బోరు బావుల ప్లాట్ ఫాం, వాటర్ ట్యాంకులలో బ్లీచింగ్, యాంటీ లార్వా మందులను స్ప్రే చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, వైద్య, మున్సిపాలిటీ, పంచాయతీ శాఖ అధికారులు ప్రతినిత్యం ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో బహిరంగ మలమూత్ర విసర్జనను నియంత్రించాలన్నారు. ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 19 సంవత్సరాల లోపు 1,92,725 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ఆర్డిఓ రాథోడ్ రమేష్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, జెడ్పి సీఈఓ గణపతి, మున్సిపల్ కమిషనర్ శైలజ పాల్గొన్నారు.

రైతులకు, పేదలకు ఇచ్చిన హామీలు విస్మరించిన కేసీఆర్

నవతెలంగాణ-జన్నారం

ముఖ్యమంత్రి కెసిఆర్ పేదలకు, రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించారని తెలుగుదేశం ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు గుల్లపల్లి ఆనంద్ విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కెసిఆర్ రెండవసారి అధికారం చేపట్టినప్పటికీ నేటివరకు రైతు రుణమాఫీ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తిస్థాయిలో కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కెసిఆర్ ప్రజల సమస్యలను మరిచి ఎన్నికలపైనే శ్రద్ధ పెడ్తున్నారు తప్ప ప్రజా సమస్యలపై కాదని అన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు తాళ్ళపెల్లి రాజేశ్వర్, పెరుగు ఆత్మారామ్, పవార్ దేవిదాస్, ఉప్పుల విజయ్, పులిసెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్జీదారులతో కళకళలాడిన కొత్త కలెక్టరేట్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత నెల 30న ముఖ్యమంత్రి కేసీఆర్ కలెక్టరేట్ కార్యాలయాన్ని ప్రారంభించగా మిగిలిపోయిన పనులను శనివారం వరకు పూర్తి చేసి సోమవారం మొట్టమొదటిసారిగా ప్రజావాణిని కలెక్టర్ బోర్కడే హేమంత్ చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి అర్జీదారులు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు తరలివచ్చారు. దీంతో నూతన కలెక్టరేట్ అర్జీదారులతో కళకళలాడింది. సోమవారం వచ్చిన అర్జీలలో ఎక్కువగా గృహలక్ష్మి దరఖాస్తులు ఉండడంతో కలెక్టర్ అర్జీదారులకు నచ్చేజెప్పే ప్రయత్నం చేశారు. ఆన్‌లైన్ విధానంలో త్వరలో దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని చెప్పినప్పటికీ కొంతమంది తిరిగి వెళ్లడానికి సుముఖత చూపలేదు.

శాఖలకు సరిపోని గదులు

నూతన కలెక్టరేట్ కార్యాలయంలో దాదాపు అన్ని శాఖలు తమకు కేటాయించిన గదులలోకి కార్యాలయాలను చేర్చాయి. అయితే ఇదే సందర్భంలో కొన్ని శాఖలకు కేటాయించిన గదులు సరిపోకపోవడంతో ఇతర గదులలోకి శాఖలను మార్చారు. ఎన్నికల విభాగానికి కేటాయించిన జి9 గది సరిపోకపోవడంతో భోజనశాలకు విభాగాన్ని తరలించారు. అలాగే సిపిఓ కార్యాలయానికి కేటాయించిన గది కలెక్టర్ కార్యాలయానికి పక్కనే ఉండడం కలెక్టర్ సిబ్బందికి అదనపు గది కావలసి రావడంతో దాన్ని మొదటి అంతస్తుకు మార్చారు. ఏదేమైనా జిల్లాల ఆవిర్భావం తర్వాత జిల్లా కేంద్రంలో చాలీచాలని వసతుల మధ్య అద్దె గదుల్లో అన్ని కార్యాలయాలు కొనసాగుతుండగా నూతన కలెక్టరేట్‌తో ఆ ఇబ్బందులు పోయినట్లు పలువురు అధికారులు తెలిపారు.

ఓసీ సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-జైపూర్

శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని పేలుళ్లతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియకుండా ఉందని రామారావుపేట్ పంచాయతీ దుబ్బపల్లి గ్రామస్తులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓసీతో ఎదురవుతున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని కోరారు. బ్లాస్టింగ్‌ల కారణంగా ఇండ్ల గోడలు బీటలు వారుతున్నాయన్నారు. శ్రీరాంపూర్ ఓసీ-2 విస్తరణలో భాగంగా దుబ్బపల్లి గ్రామాన్ని ఖాళీ చేయించడం కోసం సిద్ధమైన సింగరేణి యాజమాన్యం సర్వే చేపట్టి రెండు సంవత్సరాలు కావస్తోందని తెలిపారు. దుబ్బపల్లి గ్రామాన్ని ఖాళీ చేయించడం కోసం ఇంటింటి సర్వే చేపట్టిన అధికారులు ఇప్పటి వరకు నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకుని ముంపుకు గురవుతున్న దుబ్బపల్లికి సబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసి నష్టపరిహారంతో పాటు సింగరేణి యాజమాన్యం ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణాలకు అవసరమైన నిధులు పంపిణీ చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో భూనిర్వాసితుల కమిటీ సభ్యులు రాజమల్లు, ప్రవీణ్‌తో పాటు గ్రామస్తులు ఉన్నారు.

ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు

- రేషన్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బొక్కలగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు బియ్యం అందించి నిర్వాహకులకు అవసరమైన సూచనలు చేశారు. రేషన్ డీలర్ కొమ్ము శ్రీజ రాములు ఎమ్మెల్యేతో పాటు అతిథులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ సరకులను తీసుకునేందుకు స్థానికులకు ఇబ్బంది తలెత్తకుండా నూతన దుకాణాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సరకుల సరఫరాలో ఎటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలపై ఘాటుగా బదులిచ్చారు. కర్నాటకలో పేదలకు పది కిలోల బియ్యం ఇస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం రేషన్ దుకాణాలను ఎత్తివేస్తున్నారని మండిపడ్డారు. అధికార దాహంతో మోసపూరిత హామీలను ఇస్తూ తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నా ప్రజలు అభివృద్ధికే పట్టం కడతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, నాయకులు పండ్ల శ్రీను, కొండ గణేష్ పాల్గొన్నారు.

12న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వివిధ సంఘాల నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సతీష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్యను గాలికి వదిలేసిందని, పిల్లలు తక్కువ ఉన్నారన్న నెపంతో కొన్ని వేల ప్రభుత్వ పాఠశాలలను మూసేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులిస్తూ, ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. అన్ని డిమాండ్ల సాధనకై జులై 12న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామని, అన్ని రకాల యాజమాన్యాలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు డివిజన్ అధ్యక్షులు రమేష్, జిల్లా నాయకులు హరిశ్చంద్ర ప్రసాద్, శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు అయుబ్ ఖాన్, గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు జాఫర్ పాల్గొన్నారు.

ఓసీపీ డ్రైవర్లకు వేతనాలు పెంచాలి



నవతెలంగాణ - కాసిపేట

కెకె-2 ఓసిపిలో డ్రైవర్లు ఇతర కార్మికులు ఆరు రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మె చేస్తున్నా ఆర్‌విఆర్ యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని, వెంటనే వేతనాలు పెంచాలని బిజెపి బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నిరవధిక సమ్మె చేస్తున్న డ్రైవర్లకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో ఇదే యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు ఆ డిమాండ్లను పరిష్కరించాలని, వేతనాలను గోదావరిఖని ప్రాంతంలో ఇస్తున్నట్లు ఇక్కడా పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడ 500 మంది కార్మికులు సమ్మె చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దున్నపోతు నిద్రలో ఉన్నాడని, ఎక్కడో జల్సాలు చేస్తున్నాడని, వీరి సమస్యల గురించి పట్టించుకునే తీరిక ఎక్కడిదని ప్రశ్నించారు. ఆర్‌విఆర్ యాజమాన్యం వెంటనే కార్మికులతో చర్చలు జరిపి సమ్మె విరమింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన సమ్మెకు బిజెపి సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్‌రెడ్డి, పోశం, రామకృష్ణ, రఫీ, అశోక్ పాల్గొన్నారు.

సర్పంచ్ ఇంట్లో విద్యుత్ ప్రమాదం

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని షెట్‌పల్లి గ్రామ సర్పంచ్ మేడి రవి ఇంట్లో సోమవారం విద్యుత్ ప్రమాదం చోటు చేసుకుంది. వంట గదిలో ఏర్పడిన విద్యుత్ ప్రమాదంలో గృహోకరణాలతో పాటు ఆహార ధాన్యం కాలిపోయినట్లు తహసీల్దార్ మోహన్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ వైరింగ్‌లో ఏర్పడిన షాట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ సంఘటనలో సుమారుగా లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

ఆస్పత్రికి వీల్ చైర్లు విరాళం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి బీఆర్ఎస్ నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్ తన వంతు సాయంగా సోమవారం వీల్ చైర్లు విరాళంగా అంజేశారు. అత్యవసర చికిత్స సమయంలో ఉపయోగపడే రెండు చక్రాల కుర్చీలను సమకూర్చిన జాన్సన్ నాయక్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీ అభినందించారు. ఈయన వెంట పార్టీ కార్యకర్తలు కాలేరి దివాకర్, సాడిగె ప్రసాద్, బల్గం రమేష్, శ్రావణ్, షఫీ, మజార్, శ్రీనివాస్, రాజేష్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాతా

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ఆత్రం గోవింద్‌రావు బృందం ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అపరిశుభ్రతతో డెంగ్యూ, మలేరియా, అతిసార వంటి ప్రాణాంతక వ్యాధులు సంబవిస్తాయని అన్నారు. ఈ అంటు వ్యాధులపై ఐటీడిఏ పీఓ ఆధ్వర్యంలో గిరిజనులకు వారి భాషల్లోనే ఆటల పాటల ద్వారా కళాజాతను నిర్వహించారు. ఈ కళాజాత బృందంలో చాహకటి రవీందర్, రాథోడ్ శంకర్, గట్టు వెంకట్ రావ్, రాజలింగు, మురళి, ఆశిష్, కుమ్ర నగేష్, నర్సమ్మ, ద్రుపద పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎంపీపీ మహిపాల్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో హరితహరం మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యశోద, గ్రామ కార్యదర్శి సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



నవతెలంగాణ-కడెం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని పెంబి తండలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పెంబి మండలానికి చెందిన పిట్ల భీమయ్య(45), చీమల ఎల్లయ్య(30) ద్విచక్రవాహనంపై పెంబి తండకు వెళుతుండగా సైకిల్ ఎదురుగా రావడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని వెంటనే పెంబి ఆస్పత్రిలో చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పంచాయతీ కార్మికుల సమ్మెకు బీజేపీ, ఉపాధి సిబ్బంది సంఘీభావం

నవతెలంగాణ-సిరికొండ

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మె సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మండల బీజేపీ నాయకులు, ఉపాధి సిబ్బంది సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వం గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస గౌరవ వేతనాన్ని ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అమూల్, నాయకులు రఘురాం, రమేష్, బండు, ఉపాధి సిబ్బంది, మోహన్ సింగ్, గోపాల్, సుధాకర్, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

రాబోయే మూడు నెలల్లో మోసాలకు కొత్త ప్లాన్‌లు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

రాబోయే మూడు నెలల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోనుందని, ప్రజలను తమ వైపు తిప్పుకోవడానికి కొత్త రకాల మోసాలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రజల ముందుకు రానున్నాడని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ అన్నారు. సోమవారం మహాజన్ సంపర్క్ అభియాన్ లో భాగంగా ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని మండలంలోని చాంద(టి) గ్రామంలో నిర్వహించారు. పేదల కోసం నరేంద్ర మోదీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని కట్టిస్తే దాంట్లో డాక్టర్‌లను నియమించుకోలేని అసమర్థ నాయకుడు జోగు రామన్న అని ఆరోపించారు. తన సొంత లాభం కోసం తప్పితే ఎన్నడూ ప్రజల మేలు కోసం పనిచేయలేదని అన్నారు. తాను కొనుక్కోవడానికి వందల ఎకరాల భూమి దొరికింది కానీ దళితులకు ఇవ్వడానికి 3 ఎకరాల భూమి దొరకలేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దారట్ల జీవన్. రఘుపతి, కుంచెట్టి సంతోష. మయూర్ చంద్ర, రాజు దయాకర్, సత్యనారాయణ, రవి, నాందేవ్, ముకుంద్, సూర్య, ఫరీద్, శివ, రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

నవతెలంగాణ-బేల

ఆదివాసుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం గడప గడపకు కాంగ్రెస్ పల్లెపల్లెకు కంది శ్రీనన్న నినాదంతో మండలంలోని కారా, గర్కగూడ, వంజరిగూడ, సాహెజ్ తండ, దుబ్బగూడ, టెమ్మిగూడ గ్రామాల్లో పర్యటించారు. ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే ఏక కాలంలో రూ.2లక్షలు రుణమాఫీ, తాతా, అవ్వలకు నాలుగు వేల చొప్పున పెన్షన్, భూమిలేని వ్యక్తి చనిపోతే రూ.5లక్షల బీమా, భూ యజమానికి, కౌలు రైతుకు ఇద్దరికీ రైతుబంధు, ఉపాధి కూలీలకు నెలకు రూ. వెయ్యి ఇస్తుందని అన్నారు. అభివృద్ధిని కోరుకునేవారు కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని కోరారు. రానున్న ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలోనాగర్కర్ శంకర్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, మాజీ ఎంపీపీ బాపూరావు హుల్కె, బేల మండలం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ ఫైజుల్లా ఖాన్, మడావి చంద్రకాంత్, శంకర్ భోక్రె, రాజ్ మొహమ్మద్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటాల రాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు చేపడుతున్న నిరవధిక దీక్షలో భాగంగా ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీఓ నెంబర్ 8 ప్రకారం వేతనాలను ఏరియర్స్‌తో సహ చెల్లించాలని అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయపాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని అన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. కొత్త మెనూను సవరించి అందుకు తగ్గట్టుగా బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. అక్రమ తొలగింపులు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని, అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. నల్లదుస్తులు ధరించి స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఆదిలాబాద్ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా తరలివచ్చి ధర్నా చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైటాయించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ 45వ ఐఎల్‌సీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని అన్నారు. పెన్షన్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ వెంటనే చెల్లించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించాలన్నారు. పీఆర్సీ ఎరియర్స్ 2021 జూలై, అక్టోబర్, నవంబర్ మూడు నెలలవి వెంటనే చెల్లించాలని అన్నారు. ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ఈ సమస్య పరిష్కార కోసం తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. మదర్స్ కమిటీలకు చైర్మెన్‌గా తల్లులను మాత్రమే నియమించాలని అన్నారు. గ్రామ సర్పంచులను చైర్మెన్‌గా నియమాకం చేసే పద్ధతిని వేంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య లక్ష్మి మెనూ ఛార్జీలు పిల్లలకు రూ.1.15 నుంచి రూ.5లకు, గర్భిణీలకు, బాలింతలకు రూ.2.40 నుంచి రూ.10లకు పెంచాలన్నారు. డబుల్ సిలిండర్ అన్ని కేంద్రాలకు ఇవ్వాలి. 14. అంగన్‌వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలన్నారు. జీఓ నెం 14, 19, 8లను వేంటనే సవరించాలని, అంగన్‌వాడీ ఉద్యోగులకు ఆసరా, కళ్యాణలక్ష్మి తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు వెంకటమ్మ, కోశాధికారి రత్నమాల, ఉపాధ్యక్షురాలు సునీత, సీఐటీయూ ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అంగన్‌వాడీలు పంచశీల, సురేఖ, సుభద్ర ఉన్నారు.

స్వీపర్లకు కనీస వేతనం రూ.27 వేలు ఇవ్వాలి

- భిక్షాటన చేపట్టి వినూత్న రీతిలో నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.27 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్వీపర్లు ఆందోళన బాట పట్టారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఇందులో భాగంగానే సోమవారం కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేపట్టి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. వీరికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న మద్దతు తెలిపారు. న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ నినాదాలు చేశారు. మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో గత 30-40 సంవత్సరాలుగా స్వీపర్లుగా పనిచేస్తున్నారని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కిరణ్ అన్నారు. ప్రభుత్వం తమతో వెట్టిచాకిరి చేయించుకుని కేవలం నాలుగు వేల వేతనం ఇస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమను గుర్తించి కనీస వేతనం రూ.27 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పదిహేను లక్షలు చెల్లించాలని అన్నారు. అక్రమ తొలగింపులు ఆపాలని, చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్వీపర్ల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏలేటి శంకర్, జిల్లా అధ్యక్షులు మలిన్, ఉపాధ్యక్షులు రాములు, జనరల్ సెక్రటరీ రసూల్ స్వీపర్లు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు ఆపాలని రాస్తారోకో

- రాస్తారోకోతో కిలోమీటర్ మేర నిలిచిపోయిన వాహనాలు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య ఓ ప్రయివేటు సంస్థ ఏర్పాటు చేయనున్న ఇథనాల్ ఫ్యాక్టరీ పనుల ఆపాలని, ఫ్యాక్టరీ వల్ల ముప్పు పొంచి ఉందని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్తులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభిప్రాయ సేకరణ కూడా తీసుకోకుండా ఫ్యాక్టరీ పనులను మొదలుపెట్టారని అన్నారు. ఫ్యాక్టరి పనులు నిలిపివేయాలని తహసీల్దార్, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసిన జాప్యం చేస్తున్నారని అన్నారు. దీనివల్ల పంటపొలాకు, నది జలాలకు ముప్పు పొంచి ఉందని అన్నారు. ఫ్యాక్టరీ నుండి వెలువడే పొగ నుంచి వాయు కాలుష్యం ఏర్పడి గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని అన్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థపు నీరు గోదావరి నదిలో కలవడంతో నది నీరు కలుషితమమై జీవరాశి మనుగడకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు.



రాస్తారోకోతో నిలిచిన వాహనాలు..

దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన అన్ని పార్టీల నాయకులు, రైతులు, యువకులు 66వ జాతీయ రహదారి బస్టాండ్ ముందు రాస్తారోకో చేపట్టడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో గంటన్నర పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే తహసీల్దార్ కరీం, నర్సాపూర్ ఎస్సై రవీంధర్ చేరుకుని, పనులు నిలిపివేసేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. ఇకనైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని ఫ్యాక్టరీ పనులు పూర్తిగా నిలిపివేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతులు, నాయకులు హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, ఎంపీటీసీ దొడ్డికింది గంగవ్వ ముత్యంరెడ్డి, సర్పంచ్ విరేష్ కుమార్, వీడీసీ సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండలంలోని పాటగూడ గ్రామానికి బీటీరోడ్డు వేయాలని, భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ గ్రామ వాసులకు పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆయా గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ మేరకు టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు లంక రాఘవులు మాట్లాడుతూ పాటగూడకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వర్షకాలంలో చాలా అవస్థలు పడాల్సి వస్తోందని అన్నారు. గతంలో అనేక ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపట్టినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. అలాగే భీంపూర్ మండలం రాజునగర్ ఆదివాసీ గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ రెండు గ్రామాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో టీఏజీఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో బేల, భీంపూర్ వాసులు ఉన్నారు.

ఆశ్రమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ఆశ్రమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతాల్కర్ అరవింద్ అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వరంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని ముధోల్ నియోజకవర్గం కేంద్రంలో ఉన్నటువంటి తెలంగాణ ఆశ్రమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న బడుగు, బలహీన పేద విద్యార్థులకు, అనాసక్తికరమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఆరోగ్యం బాగాలేదని చాలామంది విద్యార్థులు ఆస్పత్రులకి వెళ్లడం జరిగిందన్నారు. విద్యార్థులకు పెడుతున్న భోజనంలో పురుగులు, రాళ్లు వస్తున్నాయని అన్నారు. ఎవరికైనా సమస్యలు బయట చెబితే హాస్టల్ నుంచి తీసేస్తామని, లేకపోతే మీకు మార్కులు కట్ చేస్తామని విద్యార్థులకు బెదిరిస్తున్నారని వెల్లడించారు. గిరిజన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని అభివృద్ధి చేయాల్సిన గురుకుల పాఠశాలలో వారిని చదువు నుంచి దూరం చేసే పనులు చేస్తున్నారని అన్నారు. గతంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రోడ్ల మీద వచ్చి ధర్నా చేశారని అన్నారు. అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఏ సమస్య కూడా పరిష్కరించలేదని ఎవరి మీద కూడా చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్, ముధోల్ డివిజన్ కార్యదర్శి పరమేశ్ పాల్గొన్నారు.

రేపు పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు బంద్

- బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ పిలుపు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్‌కు పిలుపునిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా యూనిఫామ్ ఇవ్వలేదన్నారు. చదువులు చెప్పే టీచర్లు లేరని అన్నారు. పారిశుధ్య కార్మికులు లేరని అన్నారు. అనేక సమస్యలతో విద్యాసంవత్సరం ప్రారంభమైన నిర్దిష్టమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదని మండిపడ్డారు. తాగునీరు, మధ్యాహ్న భోజనం బిల్లుల పెండింగ్, మూత్రశాలలు, సరైన మౌలిక సదుపాయాలు లేక ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతోందని అన్నారు. మన-ఊరు మన-బస్తీ మన-బడి నిధులు గుత్తేదారులు తూతూమంత్రంగా మాత్రమే పనులు జరిగాయాని అన్నారు. కానీ ఎక్కడ సరిగ్గా పాఠశాలలకు ఉపయోగ పడింది లేదన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం హామీ అందని ద్రాక్షగా మారిందన్నారు. రాష్ట్రంలో గత నాలుగేళ్ల నుండి ఫీజు రీయంబర్స్ మెంట్స్‌ంట్ స్కాలర్ షిప్స్ రూ.5,177 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని కనీసం విడుదల చేయడం లేదన్నారు. గురుకులాలు, కేజీబీవీలు, ఇంటర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసిన కేజీబీవీల భవనాలు లేక అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో నడుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో భారీ సంఖ్యలో టీచర్, లెక్చరర్స్ ఖాళీలు ఉన్నాయన్నారు. వాటి భర్తీ చేయడం లేదని అన్నారు. ఒక డీఎస్సీ ఇప్పటివరకు వేయలేదన్నారు. ఈ సమస్యలను పరిష్కారం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను కదిలించి బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ బంద్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్, నాయకులు గణేష్, షేక్ శోజర్, సోనే రావు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడానికే కిచెన్ గార్డెన్‌లు

నవతెలంగాణ-కడెం

గిరిజనులు పౌష్టికాహారం తీసుకోవడం కొరకే కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేస్తున్నామని నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కొలాంగూడ ఆదివాసీ, గిరిజన గ్రామాన్ని కలెక్టర్ వరుణ్ రెడ్డి ఇటీవల దత్తత తీసుకోగా సోమవారం కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి, కిచెన్ గార్డెన్‌లో నాటిన మొక్కలను పరిశీలించారు. ఆదివాసీ గిరిజనులు తమ ఇండ్లలో పెంచుతున్న కిచెన్ గార్డెన్‌లో కూరగాయలను పండ్లను తినాలని మిగిలినవి విక్రయాలు చేపట్టి లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం కడెం రామాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న సంపద వనం స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి, సంపద వనంలో పండ్లు పూల మొక్కలు మాత్రమే నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డీఆర్డిఓ విజయలక్ష్మి, తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీఓ ఉపేందర్, ఏపీఓ జయదేవ్, ఏటీఎం రాజారాం, మండల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ప్రయివేట్ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి అండగా సీఎం సహాయనిధి నుంచి మంజూరు అయిన చెక్కులను లబ్ధిదారులకు సోమవారం ఎంపీపీ గంద్రత్ రమేష్ పంపిణీ చేశారు. అందులో భాగంగానే మండలంలోని న్యూరాంపూర్ గ్రామానికి చెందిన వొన్న రాములుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరు అయిన రూ.30 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ ప్రెసిడెంట్ అంచెట్టి నాగన్న, రైతు విభాగం వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ముందుగా వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి జరిగే ఈ సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడం తగదన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, ఎంపీఓ రమేష్, ఎంపీటీసీలు గాడ్గే సుభాష్, సుజాత, లచ్చన్న, శివకుమార్ రెడ్డి, సర్పంచులు పాండురంగ్, చౌహన్ సునీత, భీంరావు, హారన్ సుభాష్ పటేల్ పాల్గొన్నారు.

మా భూములు మాకే ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గతంలో తమకు కేటాయించిన భూములను తిరిగి అప్పగించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇచ్చోడకు చెందిన బాధితులు ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. గత ప్రభుత్వం 2006-07 సంవత్సరంలో ఏజెన్సీప్రాంతంలోని గిరిజనేతరుల కోసం 24 ఎకరాల భూమిని కొనుగోలు చేసిందని అన్నారు. ఆ భూమిలో దాదాపు 800 కుటుంబాలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసిందన్నారు. అప్పటి పరిస్థితుల దృష్ట్యా సరైన వసతులు లేక, విద్యుత్ సౌకర్యంలేక అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉండలేకపోయామని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అక్కడ జీవనం సాగించేందుకు సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గతంలో తమకు కేటాయించిన స్థలాలను తిరిగి ఇప్పించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
మంగళవారం 11 జులై 2023

ఎమ్మెల్సీ కవితను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

నిజామాబాద్ శాసన మండలి సభ్యురాలు, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు అయిన కల్వకుంట్ల కవితను టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు సురేందర్‌రెడ్డిలు సోమవారం జగిత్యాల పట్టణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కార్మికుల డిపెండెంట్ ఉద్యోగస్తుల వయసు 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్య పరిష్కరించాలని, డిస్మిస్ కార్మికుల సైతం మరొక్క మారు అవకాశం ఇవ్వాలనికోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన కవిత ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి పరిష్కరిస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు.

మంచిర్యాలకు చేరిన యూత్ కాంగ్రెస్ పోరాట యాత్ర

నవతెలంగాణ-హాజీపూర్



యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన యువ పోరాట యాత్ర సోమవారం మంచిర్యాల జిల్లాకు చేరింది. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి పట్టణంలోని ఐబి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువత, నిరుద్యోగులు, మహిళల పట్ల అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని యువ పోరాట యాత్రలో ఎండగట్టనున్నట్లు తెలిపారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అప్పుడు యువతకు నిరుద్యోగ సమస్య ఉండదన్నారు. ఉద్యోగం కావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు.

దోపిడీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

- బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

బీఆర్ఎస్ పాలన పూర్తిగా దోపిడిమయమైందని, దోపిడీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని అందవెల్లి పెద్దవాగు వంతెనను ఆయన సోమవారం పరిశీలించారు. బ్రిడ్జి కూలిపోయి సంవత్సరకాలం గడుస్తున్న స్థానిక ఎమ్మెల్యే మరమ్మతులు చేయించడం లేదని, తాత్కాలిక రోడ్డు వేయించి, బిల్లులు తీసుకొని చేతులెత్తేశారన్నారు. కాగజ్‌నగర్ నుంచి దహెగాం, పెంచికల్‌పేట మండలాలకు చెందిన దాదాపు 70 గ్రామాలకు రాకపోకలు నిలిచాయని, అత్యవసర సమయంలో రవాణా సౌకర్యాలు లేక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రజలు అత్యంత ప్రమాదకరంగా వాగు దాటుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఫాంహౌస్, ఎమ్మెల్యే ఇంటికి 80 ఫీట్ల రోడ్డు వేయించుకునే పాలకులు పేదలకు మాత్రం రవాణా సౌకర్యాలు కల్పించడంతో విఫలమయ్యారని విమర్శించారు. యాభై ఏళ్లుగా పాలకులు ఇలాగే పేదలకు చెందాల్సిన సొమ్మును అక్రమంగా దోపిడీ చేస్తున్నారని, కమీషన్ల కోసం నాసిరకం పనులు చేస్తూ దోచుకుంటున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలన్ని ఆంధ్ర కాంట్రాక్టర్లకు అప్పజెప్పుతున్నారని విమర్శించారు. ఇలాంటి దోపిడీ ప్రభుత్వం, కబ్జాకోరుల, గుండాగిరి చేసే దొంగల ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. కేవలం బహుజన రాజ్యంలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, ఉత్తర తెలంగాణ చేరిక కమిటీ ఇన్‌ఛార్జి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర నాయకులు సీడం గణపతి, నియోజకవర్గ అధ్యక్షుడు రాంప్రసాద్, నియోజకవర్గ నాయకులు నక్క మనోహర్, ప్రవీణ్, షేక్ చాంద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తం



నవతెలంగాణ-నస్పూర్

సీజనల్ వ్యాధిలో పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలనిసింగరేణి శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆర్కే-7 గనిలో గని మేనేజర్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సురక్షితమైన నీరు, ఆహారం తీసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను వాటి నివారణ చర్యలను వివరించారు. వాతావరణ పరిస్థితుల మార్పు వల్ల కలిగే వ్యాధులు సహజమని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధుల బారిన పడకుండా నివారణ చర్యలు తీసుకోవచ్చని అన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించటంవల్ల అంటువ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వ్యాధులు సోకితే సొంత వైద్యం మానుకొని వైద్యులను సంప్రదించాలని కోరారు. గుండెపోటు, బిపి, షుగర్‌తో బాధపడే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా మందులు వాడాలని తెలిపారు. ప్రతి నెలా అందుబాటులో ఉన్న సింగరేణి దవాఖాన వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి రవి శంకర్, అండర్ మేనేజర్లు రవీందర్, శ్రీనివాస్, రాజు, ఫిట్ ఇంజనీర్ ప్రవీణ్, మెకానికల్ ఇంజనీర్ సుధీర్‌రెడ్డి, వెంటిలేషన్ అధికారి జగదీశ్వర్ రావు, సంక్షేమ అధికారి సంతన్ పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయడానికి ఉద్యోగ విరమణ

- టీజీఓ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యామ్ నాయక్

నవతెలంగాణ-జన్నారం

ప్రజలకు సేవ చేయడానికి తను ఉద్యోగానికి రాజీనామా చేశాననిఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టీజీఓ అధ్యక్షుడు రిటైర్డ్ ఎంవీఐ శ్యాం నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని రెండ్లగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇటీవలే జగిత్యాల జిల్లా రవాణా శాఖ పదవికి స్వచ్ఛంద పదవి విరమణ పొందిన శ్యామ్ నాయక్‌ని ఆ గ్రామ సర్పంచ్ ఆశారాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. అనంతరం ప్రింట్ మీడియా అధ్యక్షుడు చిలువేరు నరసయ్య ఆధ్వర్యంలో అతనికి శాలువా పూలమాలతో సత్కరించారు. అదేవిదంగా మండల మెదరి కుల సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 సంవత్సరాల ఉద్యోగ కాలపరిమితి ఉన్నప్పటికీ స్వచ్ఛందంగా రాజీనామా చేసి ప్రజాసేవ చేయడానికి రావడం అభినందనీయమన్నారు. త్వరలో రాజకీయ రంగ ప్రవేశం చేయనున్నారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివద్ధి చేయడానికి తనకు ప్రజలు సహకారం అందించాలన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో రేండ్లగూడ గ్రామ ప్రజలు జన్నారం ప్రింట్ మీడియా సభ్యులు మహేంద్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు వేసిన 20 రోజులకే పగుళ్లు..!

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మంచిర్యాల నుంచి అదిలాబాద్ నిర్మల్ వెళ్లే ప్రధాన రహదారి నుంచి రాంపూర్, తిమ్మాపూర్ గ్రామాలకు వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డు వేసి 20 రోజులైనా పూర్తికాక ముందే పూర్తిగా పగళు తేలడంతో పలువురు విమర్శిస్తున్నారు. 2.2 కిలోమీటర్ల దూరం, దాదాపు రూ.95 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ రోడ్డు పగుళ్ల తేలడంతో నాసిరకం పనులు చేపట్టారని కాంట్రాక్టర్‌పై ఆరోపణలు చేస్తున్నారు. నాసిరకంగా రోడ్లు వేసి ప్రభుత్వ ధనాన్ని స్వాహా చేయడానికి కాంట్రాక్టర్ చూస్తున్నాడని, చర్యలు తీసుకొని రోడ్డు బాగు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రోడ్డుపలలు జరుగుతున్నప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే నాసిరకం పనులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెడిపోయిన రోడ్డును బాగు చేయించాలని ఆ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జాడలేని వర్షం.. కుళ్లిన విత్తనం..!

- రైతులపై భారీగా పెరిగిన పెట్టుబడి భారం
- ప్రతికూల వాతావరణమే కారణం
- ఆందోళనలో అన్నదాతలు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

పంటలు పండించడానికి తెగుళ్లతో పోరాడే రైతులకు వాతావరణం కూడా సహకరించడం లేదు. సకాలంలో వర్షాలు కురువక విత్తిన విత్తనాలు భూమిలోనే కుళ్లిపోతున్నాయి. పంట దిగుబడిపై ఆశలు పెట్టుకున్న రైతులకు పెట్టుబడి భారం భారీగా పెరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. కురవని వర్షాలతో రైతులకు అదనపు కష్టాలు తప్పడం లేదు. పంటల దిగుబడిపై ఆశలు పెట్టుకున్న రైతులు సాగుపై ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో 23వేల ఎకరాల్లో సాగు భూమి ఉంది. 16వేల ఎకరాల్లో పత్తి, 3600 ఎకరాల్లో వరి పంట, 350 ఎకరాలలో మిరప, మిగతా భూమిలో ఇతర పంటలు సాగు చేసేందుకు విత్తనాలు విత్తుకున్నారు. మండలంలో రైతులు ప్రధానంగా వర్షాలపై ఆధారపడి సాగు చేస్తుండగా కొద్ది మొత్తంలో బోరు బావులపై ఆధార పడి వ్యవసాయం చేస్తున్నారు.

పూర్తిగా పడిపోయిన వర్షపాతం

గత ఏడాదితో పోల్చితే ఈఏడాది మండలంలో ఇప్పటి వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. గత ఏడాది జూన్‌లో 325 మీ.మీ వర్షపాతం నమోదుకాగా సాధారణ వర్షపాతం 214 మి.మీగా నమోదైంది. ఈ ఏడాది 182 మీ.మీల వర్షపాతం మాత్రమే నమోదైంది. విత్తనాలు నాటిన రైతులు

జూన్‌లో విత్తనాలు నాటుకోవడానికి చెన్లను సిద్ధం చేసుకున్న రైతులు వర్షాలు ఆలస్యం కావడంతో ఆందోళనకు గురయ్యారు. వర్షాలు పడి భూమి చల్లబడిన అనంతరమే విత్తనాలు నాటుకోవాలన్న వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు నెలాఖరులో వర్షాలు పడ్డ తర్వాతే విత్తనాలు నాటు కున్నారు. వర్షాల కారణంగా గందరగోళానికి గురైన రైతులు మండలంలో 70 శాతం మాత్రమే విత్తనాలు నాటారు. పత్తి, మిరప, సోయా రైతులు మాత్రమే పనులు పూర్తి చేసుకున్నారు. వరి సాగు చేయడానికి అనుకూలంగా వాతావరణం లేకపోవడంతో ఇప్పటి వరకు తక్కువ శాతంలో వరి సాగు చేశారు.

కుళ్లపోయిన విత్తనాలు

నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలతో రైతులు విత్తనాలు నాటుకున్నారు. అయితే ఆ తర్వాత వర్షాలు కురవకపోవడంతో భూమి వేడెక్కింది. వరుసగా వారం పాటు నమోదైన ఉష్ణోగ్రతలతో భూమిలోని విత్తనాలు వేడికి ఉబ్బిపోయి కుళ్లిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడితే విత్త నాలకు మొలకలు వచ్చే అవకాశం ఉండేదని పేర్కొంటున్నారు. మండలంలో ప్రధానంగా పత్తి, మిరప సాగు చేస్తున్న రైతులు నష్టపోయినట్లు అధికారులు తెలుపుతున్నారు.

ప్రతి ఎకరాకు రూ.10 వేల నష్టం

విత్తనాలు కుళ్లిపోవడంతో సాగు భూమిలో మొలక శాతం తగ్గింది. పత్తి పంటకు ఎకరాకు సుమారు రూ.5వేల వరకు నష్టం కాగా, మిరప పంటకు రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు నష్టం వాటిల్లింది. కాగా తిరిగి సాగు చేసేందుకు మళ్లీ విత్తనాలు కొను గోలు చేస్తూ అదనంగా ఖర్చు రెట్టింపు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

80 శాతం విత్తనాలు మొలకెత్తలేదు

బోయిరే నారాయణ రైతు



చింతలమానెపల్లి శివారులో ఉన్న ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నాను. ఈ ఏడు పది ప్యాకెట్ల విత్తనాలు నాటాను. ఎరువులు, కూలీలకు మొత్తంగా సుమారు రూ.35వేల వరకు ఖర్చుచేశాను. సరిగా వర్షాలు కురవక పోవడంతో 80శాతం విత్తనాలు మొలకెత్త లేదు. దీంతో మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి నాటుతున్నాను. దీంతో రూ.25వేల వరకు అదనంగా కర్చుపెట్టాల్సి వచ్చింది.

దళితులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

దళితులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న డిమాండ్ చేశారు. సోమవారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తోందని, దళిత బంధు పథకానికి ఎవరికి దరఖాస్తు చేసుకోవాలో స్పష్టమైన ఆదేశాలను ఇవ్వడం లేదన్నారు. రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు తమ అనుచర వర్గాలకు ఉపయోగపడే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దళిత బంధు పథకాన్ని అర్హులైన వారందరికీ ఇవ్వాలని, రాజకీయ జోక్యం లేకుండా జిల్లా కలెక్టర్ల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, దళిత బంధు పథకానికి దరఖాస్తు ఆన్ లైన్‌లో నమోదు స్వీకరించాలని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి వర్తింప చేయాలని, ఇల్లు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు జీఓ నెంబర్ 58, 59 ప్రకారం తక్షణమే పట్టాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ లోన్‌లకు నిధులను మంజూరు చేయాలని, భూ పంపిణీకి అసైన్డ్ ల్యాండ్ కమిటీ పునరుద్ధరణ చేయాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం తక్షణమే స్పందించి పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మారపల్లి రవి, రాష్ట్ర సమితి సభ్యులు నక్క వెంకటస్వామి, పొన్నగంటి యోసేపు పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్ నిర్వహించడం జరుగుతుందని, ఈ బంద్ లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. కాగజ్‌నగర్ ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేష్ మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రయివేట్ ఫీజుల దందా కొనసాగుతున్నా ప్రభుత్వం వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మంత్రుల ఉపసంఘం, తిరుపతిరావు కమిటీ రిపోర్ట్ బహిర్గతం చేయకపోవడం చూస్తే ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనూకులంగా వ్యవరిస్తున్నట్లుగా ఉందన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా యూనిఫామ్ ఇవ్వలేదని, కొన్ని టైటిల్స్ పాఠ్యపుస్తకాలు పంపలేదని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వర్షాకే సాయికుమార్, మండల నాయకులు పెట్టుకుల నవీన్, లంగారి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నేటితరం విద్యార్థులకు కావాల్సిన విద్య అందించాలి

- జిల్లా ఇన్‌ఛార్జి విద్యాధికారి ఉదయబాబు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్య వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని నేటి విద్యార్థి తరానికి కావలసిన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా ఇన్‌ఛార్జి విద్యాధికారి ఉదయ బాబు అన్నారు. టాస్క్ శిక్షణ కేంద్రంలో ఐదు రోజులపాటు 49 మంది ఉపాధ్యాయులకు నిర్వహించే ఉపాధ్యాయుల నైపుణ్యా భివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని టాస్క్ సెంటర్ మేనేజర్ సాయికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో మార్పు కోసం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టాస్క్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ మాట్లాడుతూ 21వ శతాబ్దపు నైపుణ్యాలతో పాటు విద్య ఉపాధి వ్యవస్థాపకతపై ఐదు రోజులపాటు ఉపాధ్యాయులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. దీనిలో జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం ఉపాధ్యాయులకు అవసరమైన ప్రాథమిక సాంకేతిక నైపుణ్యాలు, గూగుల్ అప్లికేషన్స్, లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టం, ఫెసిలిటేషన్ నైపుణ్యాల గురించి వివరించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా శిక్షకులు బాలు ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.

కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీపీ

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల వసతిగృహాన్ని సోమవారం ఎంపీపీ విమలాబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులతో పాటు మండలంలో కూడా మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని, 9వ తరగతి విద్యార్థుల గది పైకప్పు నుండి వర్షపు నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీకి తెలపగా వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భోజన శాలకు వెళ్లి వంటలను పరిశీలించి విద్యార్థులకు భోజనం వడ్డించారు. భోజనం మెనూ ప్రకారం పెట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కోమటిగూడ సర్పంచ్ మంగళాబాయి, తమేళ సర్పంచ్ మారుతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్
- నల్ల చీరలతో నిరసన ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-నస్పూర్

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించి, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి, అంగన్వాడీలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. అంగన్‌వాడీ డిమాండ్స్ డే సందర్భంగా దేశ వ్యాప్త బ్లాక్ డే పిలుపులో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా నుంచి నస్పూర్ నూతన కలెక్టరేట్ కార్యాలయం వరకు నల్ల చీరాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ దేశంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా బడ్జెట్ తక్కువ కేటాయిస్తూ, మరోపక్క ఐసీడీఎస్ స్కీమును ప్రైవేటీకరణ చేసే దిశగా దేశంలో జాతియ నూతన విద్యా విధానం తీసుకొచ్చి పూర్తిగా ఐసీడీఎస్ వ్యవస్థను ప్రభుత్వం తన బాధ్యత నుండి పక్కన పెట్టే దిశగా ఆలోచన చేస్తుందన్నారు. ఈ కాలంలో అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయంటే గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉన్నటువంటి గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు పోష్టికాహారం అందించే దిశగా అంగన్‌వాడీ ఐసీడీఎస్ వ్యవస్థ పని చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే అన్ని పథకాలు ప్రజలకు అందుబాటులో ఉంచడానికి నిరంతరం కష్టపడుతూ శ్రమిస్తున్న వారి ఉద్యోగులపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నశించాలని, వెంటనే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.ఐదు లక్షలు, ఆయాలకు మూడు లక్షలు ఇవ్వాలని, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఎనగందుల భానుమతి, కోశాధికారి సువర్ణ, మహేశ్వరీ, చంద్రకళ, అనురాధ, సత్యవతి, విజయలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ : అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివేణి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో అఖిలభారత కోర్కెల దినోత్సవంలో భాగంగా బ్లాక్ డే నిర్వహిస్తూ సోమవారం నల్ల చీరలు కట్టుకుని నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు ప్రమాదకరమైనటువంటి 2020 నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్‌కు రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ అయిన వారికి రూ.5,00,000 ఇవ్వాలని అన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టీఏడీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ ఆప్‌లతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గంగామణి, జిల్లా నాయకులు వనిత, రాజేశ్వరి, జంగుబాయి, మల్లేశ్వరి, ధనలక్ష్మి, ఉమాదేవి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

టోకెన్ సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు



కెరమెరిలో..

నవతెలంగాణ-కెరమెరి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం (సీఐటీయూ) జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ఎమ్మార్సీ కార్యాలయాల్లో టోకెన్ సమ్మె చేపట్టామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మీ, లలిత, కవిత పాల్గొన్నారు.

దహెగాం : మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టి అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీసీఓ రాజేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షరాలు గురిజాల లలిత మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నాగుల తిరుపతి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు పద్మ, విజయ, లక్ష్మి, దుర్గబాయి, అంజలి పాల్గొన్నారు.

జైనూర్ : మధ్యాహ్నభోజన కార్మికులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలకేంద్రాల్లోని ఎంఆర్‌సీ కార్యాలయాల ఎదుట టోకెన్ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో మధ్యాహ్నభోజన కార్మికులు వంటలు బంద్ పెట్టి సమ్మెలో పాల్గొనడం జరిగిందన్నారు.

జన్నారం : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కూకటికారి బుచ్చయ్య అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ-పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులతో ఎంఈఓ కార్యాలయం ఎదుట టోకెన్ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 2022 మార్చి బడ్జెట్ సమావేశాల సందర్భంగా వేతనాలు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించినప్పటి నుంచి ఏరియర్స్‌తో సహా జీఓ 8 ప్రకారం ఇప్పటివరకు వారి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జువ్వాడి వసంత, అమృత, సేపూరి కార్యలక్ష్మి, జుంబర్తి లక్ష్మి, ఎలుక లక్ష్మి, ఎస్. లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరం అశోక్ నాయకులు గుడ్ల రాజన్న పాల్గొన్నారు.



దహెగాంలో..



జన్నారంలో..

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 11 జులై 2023

పాఠశాలలను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రీడింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా విద్యార్థులు పాఠ్యాంశాలను చదివి వినిపించారు. పఠనోత్సవం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పీఆర్ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

సిరికొండ : మండలంలోని వివిధ గ్రామాలలో రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాను ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌తో కలిసి మండల బీఆర్ఎస్ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మండల కేంద్రం నుండి రాంపూర్, రిమ్మ, తిమ్మాపూర్, లచ్చింపూర్-బి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ఇచ్చోడ మండల కేంద్రం నుండి సిరికొండ మండల కేంద్రం వరకు డబుల్ రోడ్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బషీర్, విఠల్ పటేల్, బాలాజీ పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు జీఓకు విరుద్ధంగా వేతనాలు



నవతెలంగాణ-మందమర్రి

కేకే ఓబీ కాంట్రాక్టు వోల్వో ఆపరేటర్లకు సుప్రీంకోర్టు జీఓకు విరుద్ధంగా వేతనాలు ఇస్తున్నారని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి సంజయ్ కుమార్ అన్నారు. కాంట్రాక్ట్ వోల్వో ఆపరేటర్లు 6రోజులుగా చేస్తున్న సమ్మెకు పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షులు సంజయ్ కుమార్ సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల జీతాల కోసం ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్న ఆర్వీఆర్ కంపెనీ తీరును వ్యతిరేకిస్తూ ఓబి కార్మికులు చేస్తున్న పోరాటానికి న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామన్నారు. కొన్ని సంవత్సరాలుగా సింగరేణిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటూ కెసిఆర్ ప్రభుత్వం, కాంట్రాక్టర్లు, సింగరేణి యాజమాన్యం కార్మికుల బతుకులతో ఆడుకుంటున్నారన్నారు. సింగరేణిలో వచ్చిన 700 కోట్ల లాభాన్ని ప్రతి ఒక్క కాంటాక్ట్ కార్మికుడికి పంచాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎంపీ వెంకటేష్ నేత దీనికి పూర్తిగా బాధ్యత వహించి రెండు రోజుల్లో వారికి న్యాయం చేయకపోతే జరిగే పరిణామాలకు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు వాసాల సంపత్, మందమర్రి పట్టణ ప్రధాన కార్యదర్శి రాజు, కిష్టయ్య, తిరుపతి, మధు, తిరుపతి పాల్గొన్నారు.

ఓటు అవగాహన రథాలను ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టరేట్ సమావేశ మందిరం ఆవరణలో ఈవీఎం, వివి ప్యాట్‌ల ద్వారా ఓటు వేసే ప్రక్రియను తెలియజేయడానికి ఏర్పాటు చేసిన రెండు శిక్షణ, అవగాహన రథాలను కలెక్టర్ రాహుల్ రాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు ఒకటి చొప్పున రెండు ప్రచార రథాలను ప్రారంభిస్తున్నామన్నారు. వీటి ద్వారా నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్లకు ఈవీఎం, వివి ప్యాట్‌ల వినియోగంతో ఓటు వేయడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్క ఓటరు పోర్టల్‌లో ఎపిక్ నంబర్‌ను ఎంటర్ చేసి వారి వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఒకవేళ తొలగించబడినట్లైతే ఫారం-6ను నింపి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాథోడ్ రమేష్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోతులు, పందులు లేకుండా చూడాలి



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణ ప్రజలను కోతులు, పందులు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, వెంటనే వీటిపై తగు చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేశ్ అన్నారు. సోమవారం పట్టణ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ తిరుమలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం పూట కోతులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోకి చొచ్చుకు వచ్చి నానా బీభత్సం సృష్టిస్తున్నాయని, అడ్డుకునే ప్రయత్నం చేస్తే మీద పడి దాడులు చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఇళ్లలోని మహిళలు చిన్నపిల్లలు కోతుల బెడదతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చాలా మందిపై కోతులు దాడి చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. పట్టణంలో సుమారు వెయ్యికి పైగా కోతులు స్వైర విహారం చేస్తున్నాయని, గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి వీధిలోను పందులు నివాసం ఏర్పచుకున్నాయని, పందుల వల్ల వర్షాకాలంలో వ్యాధులు సంభవించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై గతంలో అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా నామమాత్రంగా పరిష్కారం చూపించారు తప్ప శాశ్వత పరిష్కారం చూపించలేకపోయారన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తన్నీరు సతీష్, యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి మొహ్మద్ ముజీబ్, బీసీ పట్టణ అధ్యక్షులు రవిచందర్, నాయకులు సుశీల్, నవీన్ ఉన్నారు.

ఉచిత కంది విత్తనాల పంపిణీ



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని వంజీరి రైతు వేదికలో సోమవారం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ ద్వారా వందశాతం సబ్సిడీపై ప్రభుత్వం మంజూరు చేసిన కంది విత్తనాలను సోమవారం ఏఈఓ సృజన రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో పప్పుదినుసుల సాగును ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. రైతులు వీటిని సాగు చేసి లాభాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మిక వ్యవస్థ ప్రయివేటీకరణకు కుట్ర

- బహుజన రాజ్యంలో పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తాం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉండరని, కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిన కెసిఆర్ పారిశుధ్య కార్మికులను ఎందుకు పర్మినెంట్ చేయలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం మున్సిపాలిటీ కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ముఖ్యమంత్రి పదవి ఉంటుందా? అలాగే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఉండకూడదని చెప్పిన సీఎం పదేళ్ళ దాటినా పారిశుధ్య కార్మికులను ఎందుకు రెగ్యులరైజ్ చేయడం లేదని ప్రశ్నించారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి కష్టపడి ప్రజలను కాపాడిన పారిశుధ్య కార్మికులపై కేసీఆర్ వివక్ష చూపడం సరికాదన్నారు. కేవలం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 25వేల మంది పారిశుధ్య కార్మికులున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం కుట్రపూరితంగా ఈ పారిశుధ్య కార్మికులందరిని రాంకీ అనే కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. దమ్ముంటే ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకే డంపింగ్ యార్డు, చెత్త సేకరణ వంటి కాంట్రాక్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల సమస్యల గురించి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏవీ పట్టించుకోవడం లేదని, కేవలం బీఎస్పీతోనే కార్మికుల బతుకులు మారుతాయని తెలిపారు. అరకొర జీతాలిచ్చి, అనారోగ్యం బారిన పడినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.



అందుకే రాబోయే ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక పార్టీలన్నింటినీ ఓడించి, ఏనుగు గుర్తుకు ఓటేసి బీఎస్పీని గెలిపించాలని కోరారు.

బీబీహెచ్ఎస్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేస్తాం

పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాల(బీబీహెచ్ఎస్)ను సందర్శించారు. 65 ఏళ్లుగా ఎంతో మంది ప్రయోజకులను, ఆఫీసర్లను అందించిన బాలభారతి పాఠశాలను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మూసేయాలని చూస్తున్నారన్నారు. ఆ స్థలాన్ని ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యతిరేకులని విమర్శించారు. ఎమ్మెల్యే అనుచరులు పేదల కోసం నడుస్తున్న పాఠశాలకు కరెంట్, నీళ్లు కట్ చేయడం, టీచర్లను వేధించడం దారుణమన్నారు. వేధింపులకు గురి చేస్తున్నవారిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేయకపోవడం దుర్మార్గమన్నారు. పేద బిడ్డలకు చదువు అందాలన్నా, విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించాలన్నా బహుజన రాజ్యం రావాలన్నారు. బాలభారతి పాఠశాలను బహుజన రాజ్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేస్తామని మాటిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర సెక్రటరీ సిడాం గణపతి, పట్టణ నాయకులు నక్క మనోహర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు చేపడుతున్న టోకెన్ సమ్మెకు మద్దతు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు 2022 మార్చి బడ్జెట్ సమావేశాల సందర్భంగా వేతనాలు పెంచుతున్నట్టు సీఎం ప్రకటించినప్పటి నుండి ఎరియర్స్‌తో సహా జీవో నెంబర్ 8 ప్రకారం చెల్లించాలని, కొత్త మెను సవరించాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అక్షయపాత్ర సంస్థకు అప్పజెప్పడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కోడి గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, అవసరమైన గ్యాస్ సిలిండర్లను సబ్సిడీకి ఇవ్వాలని, అక్రమ తొలగింపులు అరికట్టి రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు జయమ్మ, సత్తమ్మ, గంగమణి, లక్ష్మి, తనూజ, అంజలి పాల్గొన్నారు.





ఖానాపూర్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మెను కార్మికులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బి.లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక విద్యా వనరుల కేంద్రం ముందు బైటాయించి నిరసన తెలిపిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న నిరవధిక టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మూడు వేల రూపాయలు కూడా అందని పరిస్థితి ఉందని, నెలనెల రావాల్సిన బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 10, 11 తేదీల్లో టోకెన్ సమ్మె సందర్భంగా స్థానికంగా నిరసన ప్రదర్శనలు చేయాలని, 12న కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాధ, మండలం నాయకులు నెమ్మది, పద్మ, లక్ష్మీ, రాజవ్వ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

అర్జీలపై త్వరితగతిన చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి అర్జీలపై త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆమె అర్జీలు స్వీకరించారు. కెరమెరి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కోట్నక్ విజయ్ తనకు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని, గుడిహత్నూర్ మండలం న్యూసోమార్‌పేట్ గ్రామస్థులు తమ గ్రామానికి రోడ్డును మంజూరుకు, దస్తురాబాద్ మండలం మున్యమ్ గ్రామానికి చెందిన భూక్యా వంశీ తనకు స్వయం ఉపాధికి ఆర్థిక సహాయం చేయాలని, నెన్నెల మండలం ధమ్మిరెడ్డి గ్రామస్థులు తమకు ఆర్వోఎఫ్ఆర్ హక్కు పత్రాలను మంజూరు చేయాలని కోరారు. పింఛన్, రెండు పడక గదుల ఇండ్లు, ఆశ్రమ పాఠశాలలలో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటు ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి. శ్రీజ, ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్, ఏపీఓ జనరల్ కనక భీంరావు, ఏడిహెచ్ఓ కుమ్ర బాలు, ఏఓ రాంబాబు, పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్, పిహెచ్ఓ సందీప్, జేడీఎం నాగభూషణం, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్ పాల్గొన్నారు.

దేవాలయ భూమికి రక్షణ కల్పించాలి

జైపూర్ : గంగిపల్లి శివారులో గల మాంతమ్మ దేవాలయం కోసం కేటాయించిన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా రక్షణ కల్పించాలని గంగిపల్లి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగిపల్లి సదర్ రోడ్డులో ఉన్న మాంతమ్మ దేవాలయం కోసం గతంలోనే 30 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం మాంతమ్మ దేవాలయం సరిహద్దున గల సర్వే నెంబ 128 పట్టా భూమితో పాటు 127లో గల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసిన తురుక సత్యనారాయణరెడ్డి దేవాలయం భూమిని ఆక్రమించుకున్నారని తెలిపారు. మాంతమ్మ గుడి అభివృద్ధికి కృషి చేయాల్సింది పోయి ఏకంగా దేవాలయం భూమి 30గుంటలు ఆక్రమించుకోవడం అన్యాయమని పేర్కొంటున్నారు. ఆక్రమణకు గురైన దేవాలయం భూమికి రక్షణ కల్పించడంతో పాటు సహకరించిన వారిపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

పేదల పక్షానే కాంగ్రెస్



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పేదల పక్షాన నిలబడి, వారి సంక్షేమానికి పాటుపడేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిప్పల్‌దరి, దైగూడ గ్రామాల్లో పార్టీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డితో కలిసి సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రైతు, యూత్ డిక్లరేషన్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. సుజాత మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి అధికారంలోకి తీసుకువస్తే అర్హులైన వారికి 5లక్షలతో పక్కా ఇళ్ల నిర్మాణంతో పాటు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, 4000 పెన్షన్, రైతుకు 2 లక్షల రుణమాఫీ, భూమి లేని నిరుపేదలకు సంవత్సరానికి 12వేలు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. దైగూడ గ్రామానికి చెందిన బీజేపీ నాయకురాలు గంటుబాయి తన 50మంది అనుచరులతో సుజాత, డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భగవాండ్లు, మోహన్, బాలు, సారంగరావు, మాజీ ఎంపీటీసీ ఆరె పొచ్చన్న, రాజేశ్వర్, మధుకర్, వినోద్ పాల్గొన్నారు.

రామగుండం మెడికల్ కాలేజీకి దరఖాస్తు చేసుకోవాలి

నస్పూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కాలేజ్(సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో సింగరేణికి ప్రత్యేకించిన 5 శాతం రిజర్వేషన్ కోటా కింద 7 సీట్లు పొందడం కోసం సింగరేణి ఉద్యోగులు, అధికారుల పిల్లలు ఈ నెల 14లోగా ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ఫైనాన్స్, పర్సనల్ ఎన్.బలరాం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే పొందవచ్చని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి ప్రకటించినట్లు తెలిపారు. 5శాతం రిజర్వేషన్ కింద సింగరేణి కార్మికుల పిల్లలకు ఏడు సీట్లు లభిస్తాయని, ఈ సీట్లను జాతీయ స్థాయి నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షలో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన వారిలో అత్యుత్తమ ర్యాంకుతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి వారీగా రిజర్వేషన్ వర్తింపజేస్తూ సీట్లు కేటాయిస్తారని తెలిపారు. ఈ సీట్ల కోసం దరఖాస్తు చేయదలచుకున్న సింగరేణి ఉద్యోగుల పిల్లలు తల్లి లేదా తండ్రి పని చేస్తున్న గని లేదా విభాగం అధిపతుల నుంచి నిర్దేశిత నమూనాలో ధ్రువీకరణ పత్రాన్ని తీసుకొని సమర్పించాలన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. సోమవారం తెలంగాణ అంగన్వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల నుండి సమీకృత కలెక్టర్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రిటర్మెంట్ బెనిఫిట్ రూ.10లక్షలు ఇవ్వాలని, ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి లలిత, ఉపాధ్యక్షురాలు విజయ, గంగామణి, రజియా, రమ్య లావణ్య, అనురాధ, భాగ్యలక్ష్మి పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

స్వీపర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న స్వీపర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట చేపట్టిన దీక్షలకు ఆమె సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సారాలు గడిచినా ఇప్పటికీ కేవలం రూ.4వేల రూపాయలకు పనిచేస్తున్నారని, స్వీపర్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.27,000 చెల్లించాలని, రిటైర్మెంట్ అయిన వారికి నెలకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.15లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట నాయకులు దారట్ల జీవన్, లీలావతి, కిరణ్ చాహకటి, సతీష్‌రెడ్డి ఉన్నారు.

జగ్జీవన్‌రాం విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బాబు జగ్జీవన్ రాం విగ్రహ ప్రతిష్టాపనకు ఎంపీపీ పెందూర్ మోతీరాం, వైస్ ఎంపిపి సయ్యద్ అబ్దుల్ కలాం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఇఫ్తేకార్ అహ్మద్, మాజీ ఎంపిటిసి గోగర్ల రాజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇనూస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పొర్ల వెంకటేష్, వినేష్, వెంకటి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ముధోల్

ముధోల్‌కు చెందిన ఆసిఫ్, మోహిత్, లక్ష్మి బాధిత లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి కింద మంజూరైన లక్ష రుపాయల విలువగల చెక్కులను బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్ సోమవారం అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేసిందన్నారు. బాధితులకు వైద్య ఖర్చులకు సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, నాయకులు విఠల్‌రెడ్డి, గౌతం, సంజీవ్ పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని సీఎం సహాయ నిధి చెక్కులను జడ్పీటీసీ పల్లె చంద్రయ్య లబ్ధిదారులకు అందించారు. పెద్దనపల్లి గ్రామ పంచాయతీకి చెందిన చింతల భీమయ్యకు రూ.55 వేలు, ముత్యంపల్లి గ్రామానికి చెందిన సిలోజు మురళికి రూ.14 వేల సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పీటీసీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, కనకయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ ఎన్నిక

నవతెలంగాణ-తలమడుగు



ఎమ్మార్పీఎస్ మండల మండల కన్వీనర్‌గా గొంటిముక్కల ప్రేమేందర్, టౌన్ కమిటీ అధ్యక్షులుగా మామిడి సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం సీనియర్ నాయకులు ఆశన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరితో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లేష్ పాల్గొన్నారు. కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 11 జులై 2023

నాయకులకు పాలాభిషేకం

నవతెలంగాణ-కౌటాల



పోడు రైతులకు ఇటీవల సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పోడు రైతులకు పోడు పట్టాలు ఇవ్వడంతో సోమవారం మండలంలోని తుమ్మిహేటిలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనప్ప, జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం సర్పంచ్ చరందాస్ మాట్లాడుతూ పోడు రైతుల పట్టాల కోసం కొట్లాడి జైలుశిక్షను అనుభవించి మాకు పోడు పట్టాలు అందించిన జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావుకు బ్రతికున్నంతకాలం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

కూరగాయలతో మహాంకాళి అలంకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



ఆషాడ మాసం సందర్భంగా సోమవారం ఈజ్‌గాం శివ మల్లన్న దేవాలయం మహాకాళి మాతను వివిధ కూరగాయలతో శాకంభరీ మాతగా ప్రత్యేక అలంకరణ చేశారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని వేద పండితులు నరహరి శర్మ, ఆలయ అర్చకులు సంతోష్ శర్మ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇందారపు రాజేశ్వర్‌రావు, ఈఓ వేణుగోపాల్ గుప్తా, కోనేరు రుక్మణీ, ఆలయ కమిటీ సభ్యురాలు మమతా, శివ ప్రసాద్, నగునూరి నీరజ, అరుణ, చెలిమెల ప్రశాంత్, కంభంపాటి సతీష్ పాల్గొన్నారు.

సామాజిక భద్రత చెక్కుల అందజేత



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి-3,3ఏ గనిలో వివిధ కారణాలతో మృతి చెందిన సింగరేణి కార్మికుల కుటుంబ సభ్యులకు సామజిక భద్రత చెక్కులను(ఎస్ఎస్ఎఫ్) సోమవారం శ్రీరాంపూర్ గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ అందజేశారు. మరణించిన కార్మికులు తాటి వెంకయ్య (ట్రామర్) కుటుంబానికి రూ.62,500, తోకల ముత్యాలు (సౌండ్ మిక్స్ కోఆపరేటర్) కుటుంబానికి రూ.62,500, చిలుముల పోషం (బదిలీ ఫిల్లర్)కుటుంబానికి రూ.61,600, అరుణ్ (జనరల్ మజ్దూర్) కుటుంబానికి రూ.61,600, చిప్పకుర్తి ప్రణయ్ కుమార్(బదిలీ వర్కర్) కుటుంబానికి రూ.61,850 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గనిలో పనిచేస్తున్న కార్మికులకు ఎల్లవేళలా సంస్థ అందుబాటులో ఉంటుందని, చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు సామాజిక భద్రత చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గని సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్ రావు, సర్వేయర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ మోహన్ సింగ్, సర్వేయర్ వినోద్ కుమార్, సేఫ్టీ కమిటి మెంబర్స్ అడి రాజమల్లు, హైదర్, దుగుట సాంబయ్య, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

అనుమతులు లేని షాపింగ్ మాల్‌ను సీజ్ చేయాలి

నవతెలంగాణ-కోటపల్లి



చెన్నూరు పట్టణంలోని కొత్త బస్టాండ్ అయ్యప్ప స్వామి టెంపుల్ పక్కన నూతనంగా నిర్మించిన షాపింగ్ మాల్‌కు మున్సిపాలిటీ శాఖ ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించారని బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం చెన్నూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నూర్ మున్సిపాలిటీ చైర్మన్ అధికార బలంతో ఎలాంటి అనుమతులు లేకుండా షాపింగ్ మాల్‌ను నిర్మించారని అన్నారు. షాపింగ్ మాల్ నిర్మాణానికి వరంగల్ నుంచి మున్సిపాలిటీ డైరెక్టర్ అనుమతి తప్పనిసరి అని అలాంటి అనుమతులు ఏవి లేకుండా నిర్మించారని తెలిపారు. షాపింగ్ మాల్ నిర్మాణానికి అగ్నిమాపక శాఖ వారు అనుమతి ఉంటేనే నిర్మించాలని ఆదేశాలు ఉన్నా వాటిని తుంగలో తొక్కారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుమతులు లేకుండా నిర్మించిన షాపింగ్ మాల్ కాంప్లెక్స్‌ను సిజ్ చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ పట్టణ అధ్యక్షులు సుశీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్, నాయకులు వంశీ, మహేష్, శివకృష్ణ, సంజయ్ పాల్గొన్నారు.

తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓకు వినతి

నవతెలంగాణ-కాసిపేట

ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం కాసిపేట ఏజన్సీ మండల పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలల్లో విద్యార్థులకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించాలని, గ్రామ పంచాయతీలకు వీటీడీఏలను ఏర్పాటు చేయాలని, గట్రావుపల్లిలో రెగ్యూలర్ ఏఎన్ఎంను నియమించాలని, ఎస్సీ కార్పోరేషన్ నుంచి సబ్సీడీపై రుణాలు అందించాలని తదితర సమస్యలపై వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి మడావి వెంకటేశ్, ఉపాధ్యాక్షుడు పెంద్రం శంకర్, సిడం గణపతి, పెంద్రం ప్రభాకర్, ఆత్రం సంజీవ్, ఉయిక మోతీరాం పాల్గొన్నారు.

అర్హులైన వారందరికి పట్టాలు ఇవ్వాలి

- తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్

నవతెలంగాణ-ఉట్నూర్

అర్హులైన పోడు భూములు సాగు చేసుకుంటున్న అందరికి వెంటనే పోడు హక్కులు కల్పించాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్ డిమాండ్ చేశారు. సోమవారం ఇంద్రవెల్లి మండలంలోని దొదండా గ్రామానికి చెందిన పోడు గిరిజనులు హక్కు పత్రాలు కల్పించాలని డిమాండ్ చేస్తు ఐటీడీఏ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలంలోని దొడండా గ్రామంలో 100 మంది పోడు రైతులు పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిస్తామని సర్వే చేసినప్పటికీ ఈ గ్రామంలో ఏ ఒక్క పొడు రైతుకు కూడా పోడు భుముల పట్టాలు రాలేదని అన్నారు. దీంతో పీఓను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుడ్మెత తిరుపతి, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ పుష్పారాణి, ఇంద్రవెల్లి మండల ఉపాధ్యక్షులు గేడం భారత్, నాయకులు, పోడు రైతులు రజినీకాంత్, శంకర్ పాల్గొన్నారు.

ఎంపికైన మెడికల్ అధికారులకు 14న కౌన్సిలింగ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన దరఖాస్తు చేసుకున్న వారి నుండి 1:3 ఎంపిక జాబితా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని ఎంపికైన వారికి ఈ నెల 14న కలెక్టరేట్‌లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య అధికారి రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబితాను నోటీస్ బోర్డుతో పాటు వెబ్ సైట్ ఆసిఫాబాద్.తెలంగాణ.జీఓటీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని గుండాయిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రధానోపాధ్యాయుడు గావుడె హన్మంతు ఆధ్వర్యంలో విద్యార్థులచే గ్రంథాలయ వారోత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల ఉద్యమం ఉధృతం చేస్తాం


- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్
- జిల్లాలో కొనసాగుతున్న పంచాయతీ సిబ్బంది సమ్మె

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు ఐదవరోజు మోకాళ్లపై నిలబడి సమస్య పరిష్కరించాలని వేడుకుంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ మద్దతు తెలిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మాట్ల రాజు, మాటూరి దుర్గాప్రసాద్, చునార్కార్ శంకర్, బోయిరే నగేష్, సీహెచ్. రాజేశ్వర్, నంది సంతోష్, పెంటపర్తి సుశీల, దుర్గం దేవమ్మ, ముంజం సుగుణ, మోతి లక్ష్మి, ఇప్ప సంధ్య, ఉప్పరి లక్ష్మి, పెంటు భాయ్, రేగుంట లింగమూర్తి, కళ్యాణ్, పెరుగు లక్ష్మణ్, అరుణ్, భారతి పాల్గొన్నారు.

హాజీపూర్ : పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు చేస్తున్న సమ్మె సోమవారం ఐదవ రోజుకు చేరింది. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల రోడ్డులో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొని వంట, వార్పుతో నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కెరమెరిలో..

కెరమెరి : జీపీ కార్మికుల సమస్యలపై పట్టింపేదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాథోడ్ శేషారావు అన్నారు. ఐదవ రోజుకు చేరుకున్న జీపీ కార్మికుల సమ్మెకు ఆయన సోమవారం వారి శిభిరానికి వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్న ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించబడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. చాలి చాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతూ గ్రామాల పరిశుభ్రతలో కీలకపాత్ర పోషిస్తున్నప్పటికి, వారిని పట్టించుకోక పోవడం విడ్డూరమని అన్నారు. గత 5 రోజులుగా గ్రామాల్లో పారిశుద్యం పడకేసిందని విమర్శించారు. వర్షాకాలం కావడంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జీపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యక్రమంలో రాందాస్, నరేష్, సంతోష్, నగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేమనపల్లి : గత ఐదు రోజులుగా వేమనపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా కన్వీనర్ చెన్నూరి సమ్మయ్య మాదిగ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ఇబ్బందులు ఎదురుకుంటూ, చాలి చాలని జీతాలతో జీవనం సాగిస్తున్న జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెన్నూరి అశోక్ మాదిగ, నాయకులు చెన్నూరి కళ్యాణ్, చిలుముల ప్రకాష్, నాయకులు ఎల్లల శేఖర్, కుడుకల ప్రవీణ్ పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన

దహెగాం : మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మె సోమవారం కూడా కొనసాగింది. వీరికి ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నాగుల తిరుపతి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సెండ రమేష్, గౌరవధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి రవీందర్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కడెం : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె సోమవారానికి సమ్మె 5వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు మద్దతుగా ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ మాట్లాడుతూ జీపి ఉద్యోగ, కార్మికులకు, వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె ఐదవ రోజుకు చేరిన సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా ఉండటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పంచాయతీ ఉద్యోగ కార్మికుల శ్రమ వల్ల దేశంలో అనేక అవార్డులు తీసుకున్న విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. జీఓ నెంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు రూ.15వేల 600, కారోబారి, బిల్ కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్లకు రూ.19వేల 500 వేతనం ఇవ్వాలని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించక పోతే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సివస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య విలాస్, జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, కార్మికులు గంగవ్వ, కిరణ్, మహేందర్, గంగన్న పాల్గొన్నారు.



వేమనపల్లిలో..



హాజీపూర్‌లో..

రేపు విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు విద్యార్థి సంఘాల జేఏసీ పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల వివక్ష చూపుతోందని దానికి నిరసనగా జూలై 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలుగా విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో విద్యాసంస్థలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మన ఊరు-మన బడి పథకంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు చేర్చి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేసి ప్రతి గురుకులానికి పక్క భవనాన్ని కేటాయించాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్నీగౌడ్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు అభినవ్, సత్యనారాయణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సికిందర్, నాయకులు రెగల్ల సిద్దార్థ, సుమన్, అనిల్ పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్



నవతెలంగాణ-జైనథ్

అక్రమంగా దళిత భూములను కబ్జా చేస్తున్న కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని మేడిగూడ(ఆర్), మేడిగూడ(సీ) గ్రామాల్లో గతంలో దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములు అమ్మడం కొనడం చట్టవిరుద్ధంగా ఉన్నప్పటికీ రాజకీయ నాయకులు మాయమాటలు చెప్పి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అల్లుడు కిరణ్‌రెడ్డి మండలంలోని మేడిగూడ(ఆర్), మేడిగూడ(సీ) గ్రామాల్లోని 22 మంది దళితుల భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. సర్వే నెంబర్ 30/1 నుంచి 30/22, 22 ఎకరాల భూమి కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. గతంలో లీజు పేరిట తీసుకుని రూ.లక్ష 70 వేలు ఇచ్చి, రూ.15లక్షలు, రూ.20 లక్షలు తీసుకున్నట్లు సేల్ డీడ్‌లు తీసుకుని, అక్రమంగా మా ప్రమేయం, సంతకాలు లేకుండా భూకబ్జా చేస్తున్నారని అన్నారు. ఐకేరెడ్డి బంధువులు దళిత భూములను అనేక గ్రామాల్లో కొనుగోలు చేస్తూ మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని గ్రామాల బాధితులను పోగుచేసి పెద్ద సంఖ్యలో ఉద్యమిస్తామని పేర్కొన్నారు. దళిత భూములు అక్రమంగా చేస్తున్న, రిజిస్ట్రేషన్‌లు, పేర్లు మార్పు చేయడం నిలిపి వేయాలని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వారికి సహకరించిన అధికారులపై సిబ్బందిపై కేసు నమోదు చేయాలని కోరారు. ఇందులో డీఎస్పీ జిల్లా నాయకులు చిట్యాల శ్రీనివాస్, దేవన్న, సంజీవ్, గజానన్, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-కడెం

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరుగుతున్న నిరవధిక టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాధా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కనీస వేతనాలను పొందకుండా సామాజిక బాధ్యతతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద పిల్లల కొరకు నిరంతరం ఎంతో ఓర్పుతో, తక్కువ పారితోషకంతో పని చేస్తున్న మహిళ ఏజెన్సీల పట్ల తెలంగాణ ప్రభుత్వం అంటి ముట్టనట్లుగా ఉందని విమర్శించారు. సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించిన రూ.3వేలు కూడా అందని పరిస్థితి ఉందన్నారు. నెల నెలా బిల్లులు రాక అప్పులు చేసి పిల్లలకు భోజనాలు పెట్టుతున్నారని అన్నారు. ఏ పని చేసుకోకుండా ప్రభుత్వం నుంచి ఎలాంటి వేతనాలు లేక తాము పస్తులు ఉండి పిల్లల కడుపు నింపే మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్మల్ జిల్లాలో అన్నీ పట్టణ, మండలాల్లో కార్మికులు 10, 11, 12 తేదీల్లో టోకెన్ సమ్మె చేస్తున్నారని 10, 11 తేదీల్లో స్థానికంగా నిరసన ప్రదర్శనలు చేసి, 12న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు చేస్తున్నట్టు తెలిపారు. దీనికి జిల్లాలోని మధ్యాహ్న భోజనం ఏజెన్సీలు నిర్వహిస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షురాలు రవీంద్ర, శంకరమ్మ, సత్తమ్మ, నసీన, విజయ, లత, లక్ష్మి, లింగవ్వ, రజిత పాల్గొన్నారు.

తెలుగుదేశం బలోపేతానికి కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన అల్లూరి రాజారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంస్థాగతంగా మండల, పట్టణ కమిటీల ఏర్పాటుతో పాటు పలు అంశాలపై చర్చించి దిశా నిర్దేశం చేశారు. అలాగే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. అంతకుముందు బాధ్యతలు స్వీకరించిన అల్లూరి రాజారెడ్డిని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినందుకు జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధికార ప్రతినిధి ఎండి రఫీక్, కార్యదర్శులు గంగాసరపు ఓమన్న, షేక్ అహ్మద్ టీఎన్టీయూసీ అధ్యక్షులు భాను రాజేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షులు గాలిపెల్లి నాగన్న, మండల పార్టీ అధ్యక్షులు సోమ గంగారెడ్డి, అల్లూరి సంతోష్‌రెడ్డి, తోకల లక్ష్మన్న, మామిళ్ల బుచ్చన్న, జక్కుల సుభాష్, తుమ్మల చంద్రయ్య, పతిహార ప్రభాకర్, అశోక్, మహిళా పట్టణ అధ్యక్షురాలు అంబు భాయ్, మహిళా నాయకురాలు సరస్వతి, పంచపూల బాయి, ఎన్ పెంటన్న, పోచన్న, అత్తర్ నరేందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆకలిని తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా సుదూర మారుమూల ప్రాంతాల నుండి ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే అర్జిదారుల ఆకలిని తీర్చేందుకు వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో బువ్వ కార్యక్రమం ప్రారంభించామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట వెడ్మ బొజ్జన్న బువ్వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏండనక, వాననక సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలను పరిష్కరించాలని ఐటీడీఏ కార్యాలయానికి అర్జీదారులు వస్తారని అన్నారు. ఈ సమయంలో వారి ఆకలిని తీర్చాలనే ఉద్యేశంతో ఉచితంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. గిరిజనులు ఐటీడీఏ వచ్చి అందించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బిరుదల లాజర్, మాజీ సర్పంచ్ జాదవ్ మానిక్ రావు, గొండుగూడ సర్పంచ్ ఆత్రం రాహుల్, నాయకులు కోటేశ్వర్, దూట రాజేశ్వర్, షేక్ సలీం, అచ్చ దేవానంద్, జైవంత్‌రావు, సయ్యద్ నిసార్, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-సిరికొండ

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి బొజ్జ ఆశన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు గత ఐదు రోజులుగా చేస్తున్న సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు గ్రామపంచాయతీల్లో చాలిచాలని వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వారిని గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస గౌరవ వేతనం రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మండల బీజేపీ నాయకులు, ఉపాధి సిబ్బంది కూడా సంఘిబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, బీజేపీ నాయకులు, ఉపాధి సిబ్బంది బత్తుల రాజు, విజయ్, ఎల్లుబాయి, గౌరు, ప్రవీణ్, జలపతి, అమూల్, రఘురాం, మోహన్ సింగ్, సుధాకర్, గోపాల్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారసంతలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ వారసంతలో తిరుగుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేదంపై అవగాహన కల్పించారు. కొంతమందికి జరిమానా కూడా విధించి రసీదులు అందజేశారు. వచ్చే వారసంతకు ఏ ఒక్కరి వద్ద ప్లాస్టిక్ కవర్లు కనబడినట్టయితే రూ.వెయ్యి వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సాండ్‌గాం ఎత్తిపోతల పథకాన్ని సందర్శించిన ఏఈ

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని సాండ్‌గాం ఎత్తిపోతల పథకం మరమ్మత్తులకై సోమవారం ఇరిగేషన్ ఏఈ రాంబాబు సందర్శించి మరమ్మత్తులు చేయడానికి అంచనా వేశారు. ఎత్తిపోతల పథకం సకాలంలో పనిచేయడానికి కావాల్సిన మరమ్మత్తులను చేయించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.